బస్టాప్‌నకు వెళ్లాలంటే ఫీట్లే..


రోడ్డుకు అవతలి వైపు వెళ్లే వీల్లేకుండా హైవేలో డివైడర్‌పై గ్రిల్స్

గ్రిల్స్ అవతల వైపు ఉన్న బస్టాప్‌ను చేరేది ఎలా?


బస్టాప్‌కు వెళ్లడానికి హైవేపై ప్రమాదకరంగా నడుస్తున్న పాదచారులు



బస్టాప్‌నకు వెళ్లడానికి గాయత్రి హాస్పిటల్ వద్ద మహిళల అగచాట్లు

మధురవాడ హైవే వద్ద ప్రయాణికుల అగచాట్లు ▪ అర కిలోమీటర్ నడక తప్పనిసరి

గ్రిల్స్ దాటే క్రమంలో ప్రమాదాలు ▪ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని విన్నపాలు

మధురవాడ: నగరంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న మధురవాడ ప్రాంతంలో సామాన్యులు బస్సు ఎక్కాలన్నా ఇబ్బంది పడాల్సి వస్తోంది. మధురవాడ, కార్‌షెడ్ జంక్షన్ల వద్ద ఒకవైపు ఉన్న వారు మరో వైపు వచ్చి బస్ ఎక్కాలంటే కనీసం అర కిలోమీటరు నడవాల్సిందే. అంతదూరం వెళ్లలేని వారు ఆటోలు లేదా ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి.

మధురవాడ వద్ద ..

మధురవాడ జాతీయ రహదారికి ఇరువైపులా జోనల్ ఆఫీసు, చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్, దేవాలయాల సముదాయం, పీహెచ్‌సీ, ఆయుర్వేద ఆస్పత్రి, విద్యుత్ శాఖ కార్యాలయాల సముదాయం, పోలీస్ స్టేషన్, విద్యాశాఖ ఆర్‌జేడీ, ఆయుష్ ఆర్‌డీడీ తదితర అధికారుల ఆఫీసులు, ఆస్పత్రులు దజనుకు పైగా ఉన్నాయి. వేలాది మంది ఇక్కడ రోడ్డు దాటడం తప్పనిసరి. దీంతో జాతీయ రహదారిపై మధురవాడ వద్ద **విశాఖ వైపు,** ఆనందపురం వైపు వెళ్లేందుకు లక్షల రూపాయలు వెచ్చించి బస్ట్ షెల్టర్లు నిర్మించారు. అంతవరకు బాగానే ఉంది. అయితే, ఇక్కడ హైవే దాటే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, అసలు ఇక్కడ రోడ్డే దాటడానికి వీల్లేకుండా సెంటర్ మీడియన్ డివైడర్‌పై అడ్డంగా గ్రిల్స్ ఏర్పాటు చేశారు. దీంతో రోడ్డు దాటి బస్ ఎక్కాలంటే మధురవాడ ఒక వైపు మధురవాడ అప్ బ్రిడ్జి, రెండో వైపు కొమ్మాది జంక్షన్ వరకు అర కిలోమీటరు పైనే నడవాల్సి వస్తోంది.


కార్‌షెడ్ జంక్షన్ వద్ద ఆనందపురం వైపు వెళ్లే బస్టాప్

కార్ షెడ్ జంక్షన్ వద్ద ..

ఇక్కడ మధురవాడ శిల్పారామం జాతర, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు, ఐటీ జంక్షన్‌తో పాటు పలు విద్యా, వ్యాపార సంస్థలు కొలువై ఉన్నాయి. పైగా మహిళలు, సీనియర్ సిటిజెన్స్ కూడా ఎక్కువగానే ఉన్నారు. ఇక్కడ కూడా విధుల నిమిత్తం వెళ్లే వేలాది మంది బస్సులు ఎక్కేందుకు రోడ్డు దాటాల్సి వస్తోంది. ప్రమాదాలు జరుగుతున్నాయని రోడ్డు మధ్యలో గ్రిల్స్ ఏర్పాటు చేశారు. ఇక్కడా అదే పరిస్థితి. ఇక్కడ బస్టాప్‌కి వెళ్లాలంటే నానా తిప్పలు పడాల్సి వస్తోంది.

● ఇక గాయత్రి మెడికల్ కాలేజ్ ఆస్పత్రి వద్ద రోగులు, వారి బంధువులు, విద్యార్థులు, సిబ్బంది రోడ్డు దాటడానికి పడుతున్న అగచాట్లు వర్ణనాతీతం.


మధురవాడ వద్ద విశాఖ వైపు వెళ్లే బస్టాప్

ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి

బస్టాప్‌లకు వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడుతున్నామని స్థానికులు, ప్రయాణికులు తెలియజేస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి బస్టాప్ వద్ద జీబ్రా లైన్స్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి.. గ్రిల్స్ వద్ద గ్యాప్ ఏర్పాటు చేయాలని **లేదా** ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: హరే కృష్ణ, హరే రామ నామస్మరణతో సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరం ఆదివారం మార్మోగింది. వారాంతపు పూజల సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభుజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలను ఆలపించారు. ప్రవచనాలు వినిపించారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

బ్లూమింగ్ స్టార్ పాఠశాల ప్రారంభం


జ్యోతి వెలిగించి పాఠశాలను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ కృష్ణవేణి

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని బ్యాంక్ కాలనీ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన బ్లూమింగ్ స్టార్ పాఠశాల ఆదివారం ప్రారంభమైంది. మాజీ ఎంపీపీ యరబాల కృష్ణవేణి ముఖ్య అతిథిగా విచ్చేసి, పాఠశాలను ప్రారంభించారు. పాఠశాల డైరెక్టర్ సుకుమార్ మాట్లాడుతూ స్కూల్ నిర్వహణ కొత్త తరహాలో ఉంటుందని తెలిపారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు.

ఉచిత యోగా శిక్షణకు ఆహ్వానం

తగరపువలస: యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అంతర్జాతీయ యోగా పరిశోధన, శిక్షణ సంస్థ–భీమిలి ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 21 వరకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. చిట్టివలస శ్రీలక్ష్మి శ్రీనివాస కల్యాణ మండపం ఆవరణలో ఉదయం 5.30 గంటల నుంచి 7గంటల వరకు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. విద్యార్థులలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి వృద్ధి, వ్యక్తిత్వ వికాసంతో పాటు మధుమేహం, కీళ్లవాతం, మోకాళ్లనొప్పులు, చర్మరోగాలు, ఆస్మా, రక్తపోటు, స్థూలకాయం, మానసిక ఒత్తిడి తదితర అనారోగ్యాలకు ఈ శిక్షణతో పరిష్కారం లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 08933–228222, 94406 43531,96660 26661 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

భీమేశ్వరాలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ట


ధ్వజస్తంభ ప్రతిష్టకు పూజ చేస్తున్న నిర్వాహకులు

భీమునిపట్నం: భీమిలిలోని పురాతన భీమేశ్వర ఆలయం వద్ద ఆదివారం ధ్వజస్తంభం ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. పాండవులు అజ్ఞాతవాసంలో భీమిలిలో ఉన్నారని, అప్పుడు భీముడు తన స్వహస్తాలతో ఇక్కడ శివలింగాన్ని ప్రతిష్ఠించారని పురాణ కథనం. ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ ఆలయం వద్దనున్న పాత ధ్వజ స్తంభం పూర్తిగా శిథిలమై పాడైపోయింది. దీంతో భీమిలికి చెందిన గుగ్గిళ్ల గురునాథగుప్త అనే బంగారం వ్యాపారి ముందుకు వచ్చి కొత్త ధ్వజస్తంభాన్ని తయారు చేయించారు. ఇప్పుడు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అలరించిన 'శ్రీకృష్ణ భక్తి అర్పణం'


బుర్రకథ ప్రదర్శిస్తున్న చిన్నారులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి 8 వరకు జరిగిన శ్రీకృష్ణ అర్పణం భక్తి కార్యక్రమం అలరించింది. చిన్నారులు వి.మేఘన, సీహెచ్ లావణ్య, వి.జ్యోష్ణవి బుర్రకథ సేవ నిర్వహించారు. అంబరీష దాస మాట్లాడుతూ ఈ వేదికలో పాల్గొనాలనుకునే వారు 9542511108లో సంప్రదించాలని కోరారు.

మురుగు అవస్థలు తప్పించాలని సీపీఎం ఆందోళన


డైలీ మార్కెట్‌లో మురుగు వద్ద సీపీఎం ఆందోళన

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ డైలీ మార్కెట్ వద్ద రోడ్డుపై తరచూ మురుగు నీరు నిలిచిపోవడంతో, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని కోరుతూ మార్కెట్‌లో మురుగు నిలిచిన ప్రాంతంలో సీపీఎం ఆధ్వర్యంలో స్థానికులు ఆందోళన చేపట్టారు. బ్యానర్, ప్లకార్డులు పట్టుకుని, పాలకుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా నినదించారు. సీపీఎం జిల్లా నాయకుడు డి.అప్పలరాజు మాట్లాడుతూ ఈ రోడ్డులోనే హాస్పిటల్స్, విద్యాశాఖ ఆర్‌జేడీ తదితర ముఖ్య కార్యాలయాలు ఉన్నాయని, నిత్యం వేలాది మంది ఈ మురుగునీటిలో నుంచి రాకపోకలు సాగిస్తూ ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఇక్కడ కాల్వగట్లు శిథిలం కావడంతో మురుగు ప్రవాహానికి ఇబ్బంది తలెత్తి, మురుగు రోడ్డుపైకి వచ్చేస్తోందన్నారు. దీంతో ఇక్కడ చిల్లర వ్యాపారులు ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. మధురవాడ అప్ బ్రిడ్జి, రేవళ్లపాలెం రోడ్డులోనూ ఇలాంటి ఇబ్బందులే ఉన్నాయని, అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.రాజ్‌కుమార్, డి.కొండమ్మ, టీకే శారద, రవి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుమారుడికి ల్యాప్‌టాప్ అందజేత


పునీత్‌కు ల్యాప్‌టాప్ అందిస్తున్న ఫ్యాబ్ ప్రతినిధులు

భీమునిపట్నం: ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి(ఫ్యాబ్) ప్రతినిధులు, తమ స్నేహితుని కుమారుడికి ఆదివారం ల్యాప్‌టాప్ అందించారు. స్థానిక జూనియర్ కళాశాలలో 1986–88లో ఇంటర్ చదువుకున్న కొంతమంది స్నేహితులు తమతో చదివిన ఎర్నింటి అచ్యుతరావు కుమారుడు, ఇంజినీరింగ్ విద్యార్థి పునీత్‌కు ల్యాప్‌టాప్ అవసరం కావడంతో, దానిని బహూకరించారు. ఫ్యాబ్ అధ్యక్షుడు కాళ్ల సన్నీ చేతులమీదుగా ఈ ల్యాప్‌టాప్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాబ్ ప్రతినిధులు గుగ్గిళ్ల సాయి, మారోజు గోపి, దేవానంద్, అశోక్, రమణారావు, సత్యనారాయణ, నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఆలయాల పునర్నిర్మాణానికి భూమి పూజ


పాలవలస గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయ భూమిపూజలో పాల్గొన్న స్థానికులు

తగరపువలస: ఆనందపురం మండలం పాలవలసలో జీర్ణావస్థలో ఉన్న గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి పంచాయతీ వాసులు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. పండితుల వేదమంత్రాల మధ్య జరిగిన కార్యక్రమంలో ధర్మకర్త పాలవలస పరదేశినాయుడు, అప్పలస్వామి నాయుడు, పూజారి నారాయణరావు, సర్పంచ్ నాగోతు అచ్చియ్యమ్మ, ఎంపీటీసీ సభ్యుడు రొంతు వెంకటరావు, భీమిలి ఏఎంసీ మాజీ డైరెక్టర్ రొంతు శ్రీను, బూర్లె గణప తదితరులు పాల్గొన్నారు.

● ఆనందపురం పంచాయతీ పొడుగుపాలెం గ్రామదేవత బంగారమ్మ ఆలయం పునర్నిర్మాణం సందర్భంగా భూమి పూజ నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు బంటుపల్లి అప్పలస్వామి, వైస్ సర్పంచ్ బంటుపల్లి రమణమ్మ, నిమ్మల ముసలయ్య, శ్రీను, జి.శంకర్, అప్పలనాయుడు, అప్పలరాజు, చెరుకూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయం ప్రారంభం


స్వామి విగ్రహానికి అభిషేకం చేస్తున్న భక్తులు

పద్మనాభం: మండలంలోని బాందేవుపురం పంచాయతీ విజయరాంపురంలో రూ.10 లక్షలతో నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అభయంజనేయ స్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. బాందేవుపురం సర్పంచ్ వాజిగాని ఆదిలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర పైడన్న, బోని సన్యాసినాయుడుతో పాటు అధిక సంఖ్యలో గ్రామస్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా 2500 మందికి అన్నదానం చేశారు.

'నగదు బదిలీ సరికాదు'

తగరపువలస: కూటమి ప్రభుత్వం రేషన్ పంపిణీకి బదులుగా నగదు బదిలీ విధానం ప్రవేశపెట్టనున్నట్టు వస్తున్న వార్తలను భీమిలి డివిజన్ సీపీఐ నాయకులు మోర అప్పలరాజు, గోవిందరావు తప్పు పట్టారు. గుజ్జు రామునాయుడు భవన్‌లో ఆదివారం వారు మాట్లాడుతూ పేదలకు కడుపు నిండాలని టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్‌టీ రామారావు ఆ రోజుల్లో కిలో రూ.2 బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఇప్పుడు ఆ పథకాన్ని నిర్వీర్యం చేసి నగదు బదిలీ ప్రవేశ పెట్టడం సరికాదన్నారు. దీనికి ప్రజలంతా వ్యతిరేకమన్నారు. వంటగ్యాస్ సబ్సిడీ విషయంలో కూడా కూటమి నాయకులు మాట తప్పారన్నారు.

ఘనంగా ముగ్గురమ్మ వార్ల ఆలయ ప్రారంభోత్సవం


అమ్మవార్ల ఆలయాల వద్దకు కలశాలతో గోస్తని నది జలాలను తీసుకువెళ్తున్న మహిళలు

పద్మనాభం: పద్మనాభం పంచాయతీ అర్చకునిపాలెంలో నూతనంగా నిర్మించిన పైడితల్లమ్మ, మరిడమ్మ, ముత్యాలమ్మ ఆలయాల ప్రారంభోత్సవం జరిగింది. ముందుగా గ్రామస్తులు ఇసకలపాలెం సమీపంలోని గోస్తని నదిలో నుంచి జలాలను మహిళలు కలశాలతో తీసుకు వచ్చి అమ్మవార్లకు, పూర్ణకలశాలకు జలాభిషేకాలు నిర్వహించారు. పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ ఆలయాలపై పూర్ణ కలశాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా హోమాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు తాలాడ నరిసింహనాయుడు, టీడీపీ నాయకులు కంటుబోతు ఎర్నాయుడు, రామసింగు సన్యాసిరావు, తాలాడ పైడిరాజు, గ్రామస్తులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

కారు దగ్ధం


మంటల్లో కాలిపోయిన కారు

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాంలో బొద్దపు శ్రీనివాసరావు అనే వ్యక్తికి చెందిన మహేంద్ర ఎక్స్‌యూవీ 500 కారుకు శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. రాత్రి 11.30 గంటల సమయంలో మంటల్లో కారు కాలిపోతుండగా స్థానికులు బాధితునికి ఫోన్ చేసి సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న బాధితుడు కారు కాలిపోయి దట్టమైన పొగ వస్తుండటంతో పోలీస్ హెల్ప్ లైన్ నంబర్ 112, ఫైర్ హెల్ప్‌లైన్ నంబర్ 101కు సమాచారం అందించారు. దీంతో ఈ రెండు విభాగాల సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. ఈ మేరకు బాధితుడు ఆనందపురం సీఐ వాసునాయుడుకు ఫిర్యాదు చేయగా, ఎస్ఐ సంతోష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను అలరించింది. నగరంలోని సిద్ధేంద్ర యోగి నాట్య నిలయంలో శిక్షణ పొందుతున్న కళాకారులు అద్భుత నృత్య విన్యాసాలతో ఆకట్టుకున్నారు. స్థానిక పాలనాధికారి రమేష్ రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఉత్సాహంగా ఫుట్‌బాల్ పోటీలు


పోటీల్లో గెలుపొందిన జట్టు

భీమునిపట్నం: భీమిలి మైదానంలో ఆదివారం చెన్నా నరసింగరావు మెమోరియల్ ఫుట్‌బాల్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో ఉత్తరాంధ్ర స్థాయిలో అండర్ 14, అండర్ 16 విభాగాలకు చెందిన 24 జట్లు పాల్గొన్నాయి.అండర్ 14 విభాగంలో విజయనగరానికి చెందిన టౌన్ స్పోర్టింగ్ క్లబ్ జట్టు విజేతగా నిలవగా, విజయనగరానికే చెందిన రేసింగ్ స్టార్ జట్టు రన్నరప్ సాధించింది. అండర్ 16 విభాగంలో కొమ్మాదికి చెందిన విజ్ఞు ఎఫ్.సి. జట్టు విజేతగా నిలవగా, విజయనగరానికి చెందిన రేసింగ్ స్టార్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేత, రన్నరప్ జట్లకు భీమిలికి చెందిన కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ రూ.5వేలు, రూ.3వేల చొప్పున బహుమతులను అందించారు. ఫౌండేషన్ సభ్యులు భానోజీరావు, శ్రీనివాసరావు, బాబ్జీ, నరేంద్రకుమార్, సీతారామరాజు, చినబాబు, వరహాలు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఐదుగురు విద్యార్థుల ఎంపిక

తగరపువలస: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థులు ఐదుగురు ఎంపికయ్యారు. వీరిలో రిక్క రేష్మ, ఆర్.శ్రావ్య, బి.లిఖిత, జి.రితిక, మాధురీసాహు ఉన్నారు. ఎంపికైన ఈ విద్యార్థులకు నాలుగేళ్ల పాటు రూ.12వేల వంతున స్కాలర్‌షిప్ లభించనుంది. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు ఆదినారాయణ, ఎన్‌ఎంఎంఎస్ సమన్వయకర్త పక్కి నాగేశ్వరరావు అభినందించారు.

చిన్నారి చదువుకు చేయూత


బాలికకు ఆర్థిక సాయం అందిస్తున్న శ్రీరామ్

భీమునిపట్నం: భీమిలికి చెందిన కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చిన్నారి చదువుకు ఆర్థిక సాయం అందించింది. విజయనగరానికి చెందిన భావన అనే నిరుపేద చిన్నారికి తండ్రి లేకపోవడంతో ఆమె చదువుకోసం రూ.6 వేలను సంస్థ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ ఆదివారం అందజేశారు.

ముగిసిన హెచ్‌ఆర్‌ఎం సర్టిఫికెట్ ప్రోగ్రాం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీలో ఆదివారం ఫ్లాగ్‌షిప్ ఎగ్జిక్యూటివ్ సర్టిఫికెట్ ప్రోగ్రాం ఇన్ అడ్వాన్స్‌డ్ స్ట్రాటజిక్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ముగింపు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ప్రొఫెసర్ బిషాఖా మజుందార్, అమిత్ బరన్ చక్రవర్తి తదితరులు మాట్లాడుతూ ప్రాజెక్ట్ ప్రెజెంటేషన్లు, ప్రతిబింబ మూల్యాంకనాలు, ప్రోగ్రాం అధ్యాపకుల ఉపన్యాసాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్‌పర్సన్ ప్రొఫెసర్ అనురాధ మాట్లాడుతూ హెచ్‌ఆర్ ధోరణులను వివరించారు.

షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఏడుగురు ఎంపిక

పద్మనాభం: షైనింగ్ స్టార్స్ అవార్డుకు పద్మనాభం మండలంలో ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో పి.రమణప్రకటనలో తెలిపారు. బీఆర్ తాళ్లవలస జెడ్పీ హైస్కూల్‌కు చెందిన బంగారి మేఘన, విజయానందపురం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జన్ని మౌనిక, పద్మనాభం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కొండ గౌరి హర్షవర్ధని ఎంపికైనట్లు తెలియజేశారు. వారితో పాటు కృష్ణాపురం స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాలకు చెందిన మరగడ పూర్ణ తేజ శ్రీ, బందారు వంశీ, శ్రీ వాణి సంతోష్ పాఠశాలకు చెందిన గిరడ హిమ శ్రీ, రెడ్డిపల్లి జ్ఞాన జ్యోతి పాఠశాలకు చెందిన రెడ్డిపల్లి వినీల్ ఎంపికయ్యారన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీలో శ్రీబాసర విద్యార్థుల ప్రతిభ

తగరపువలస: శనివారం విడుదలైన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాలలో స్థానిక శ్రీబాసర విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరచి విజయకేతనం ఎగరవేశారు. ఫస్టియర్ ఎంపీసీలో 470 మార్కులకు గాను షేక్ అమీనా 467, కేవీవీ కార్తీక్ 466, అల్లు హాసిని, పి.యామిని, పి.ఆశాజ్యోతి, జి.శ్రీలక్ష్మి 465 మార్కులు సాధించారు. ఎంఈసీలో 500 మార్కులకు గాను వెలిది హాసిని 490, బైపీసీలో 440 మార్కులకు గాను మహమ్మద్ షీరున్ 432, సీఈసీలో 500 మార్కులకు గాను పి.భరత్ 487 మార్కులు సాధించారు. 470 మార్కులకు గాను 35 మందికి పైగా విద్యార్థులు 460కి పైగా మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను, అధ్యాపకులను శ్రీబాసర విద్యాసంస్థల చైర్మన్ పూడి రమేష్, జోనల్ ప్రిన్సిపాల్ వీవీడీ రమేష్, అకడమిక్ కో–ఆర్డినేటర్ బంకి వినోద్ కుమార్ అభినందించారు.

ఛాతినొప్పితో కారు డ్రైవర్ మృతి


మృతుడు దేవారావు

తగరపువలస: ఆనందపురం మండలం నీళ్లకుండీల కూడలి వద్ద ఆదివారం సాయంత్రం ఆరిలోవకు చెందిన కారు డ్రైవర్ పి.దేవారావు (45) ఛాతీనొప్పితో మృతి చెందారు. దేవారావు తన కారులో కొంతమంది స్థానికులను అనకాపల్లి జిల్లాలోని పైడివాడ అగ్రహారంలో జరిగిన ఒక ఫంక్షన్‌కు తీసుకెళ్లారు. అక్కడ నూకాలమ్మ దర్శనం చేసుకున్న తర్వాత, ఆరిలోవకు తిరిగి వస్తున్నారు. అక్కివరం పీఎస్ఎల్ వద్ద ఆరిలోవ వెళ్లేందుకు సర్వీస్‌రోడ్డులోకి మారాల్సి ఉండగా, దారి తప్పి నీళ్లకుండీల కూడలికి చేరుకున్నారు. ఆ సమయంలో ఆయనకు ఛాతీలో తీవ్రమైన నొప్పి రావడంతో కారును పక్కకు తీసి ఆపారు. వెంటనే హైవే అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని పరీక్షించగా, అప్పటికే దేవారావు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు ఆరిలోవలోని చివరి బస్టాప్ వద్ద నివాసం ఉంటున్న ఆయనకు భార్యాపిల్లలు ఉన్నారు. ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈతకు వచ్చిన యువకులకు కౌన్సెలింగ్


యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శ్రీధర్

పద్మనాభం: పాండ్రంగి పంచాయతీ కురపల్లిలో గోస్తని నదిలో ఉన్న ఆనకట్ట వద్దకు ఆదివారం ఈతకు వచ్చిన యువకులకు సీఐ సీహెచ్ శ్రీధర్ కౌన్సెలింగ్ చేశారు. విశాఖపట్నం పెదవాల్తేరు, జ్ఞానాపురం ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడికి ఈతకు వచ్చారు. మద్యం సేవించి దుర్భాషలాడడంతో స్థానికులు పద్మనాభం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ, పోలీసులు ఆనకట్ట వద్దకు వెళ్లి వీరికి కౌన్సెలింగ్ చేశారు. ఆనకట్ట వద్ద ఈతకు దిగడం ప్రమాదకరమని, స్థానికులను దుర్భాషలాడడం చట్టరీత్యా నేరమని సీఐ వారికి తెలియజేశారు. ఎనిమిది మందిపై పెట్టీ కేసు నమోదు చేశారు.